క్లుప్తంగా

95.96 శాతం పింఛన్ల పంపిణీ



పింఛన్ల పంపిణీ పర్యవేక్షిస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గురువారం 95.96 శాతం పింఛన్లు పంపిణీ జరిగినట్లు కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. 50 డివిజన్ల పరిధిలో వితంతు, దివ్యాంగ, వయోవృద్ధుల పింఛనుదారులు 22,692 మంది ఉండగా... వారికి పింఛను మొత్తం అందించేందుకు రూ.9.87 కోట్లు విడుదల చేశారు. అందులో గురువారం 21,775 మంది లబ్ధిదారులకు రూ.9.45 కోట్లు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. పింఛన్ల పంపిణీ ప్రక్రియను కమిషనర్ నల్లనయ్య పర్యవేక్షించారు.

బొప్పడాం జంక్షన్‌లో చోరీ



బొప్పడాం జంక్షన్‌లో చోరీ జరిగిన టీ టైమ్ దుకాణం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని బొప్పడాం జంక్షన్‌లో ఉన్న టీ టైమ్ దుకాణంలో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఈ ఘటనపై బాధితుడు దన్నాన బంగార్రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జంక్షన్‌లో ఉన్న టీ టైం లో ఐస్ క్రీమ్ ఫ్రిజ్‌తో సహా, గ్యాస్ సిలిండర్, స్టవ్‌తో పాటు ఇతర విలువైన వస్తువులను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం వాటిల్లిందని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. వ్యాన్‌లో వచ్చి మరీ చోరీకి పాల్పడ్డారని చెప్పారు. దొంగతనంపై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

కాలువపై ఆక్రమణల తొలగింపు

- నేటి నుంచి శానిటేషన్ స్పెషల్ డ్రైవ్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ తారక్‌నాథ్

నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలో మే 2 నుంచి శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్టు కమిషనర్ ఎ.తారక్‌నాథ్ వెల్లడించారు. నగర పంచాయతీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ప్రధాన రహదారి ఆనుకుని ఉన్న కాలువపై ఉన్న ఆక్రమణలను తొలగిస్తామని చెప్పారు. అలాగే నగర పంచాయతీలో ఉన్న 267 అక్రమ కుళాయి కనెక్షన్లను తొలగిస్తామని చెప్పారు. అవసరమైన చోట కొత్త కుళాయి కనెక్షన్లు, వీధి లైట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. మే 2 నుంచి 15 వరకూ ప్రధాన కాలువల్లో పూడికను జేసీబీ సాయంతో పూర్తి స్థాయిలో తీస్తామని చెప్పారు. 16 నుంచి 30 నుంచి వీధుల్లో పారిశుధ్య పనులు చేపడతామని చెప్పారు. పారిశుధ్య సిబ్బంది ఉదయం 5.30 గంటలకే విధులకు హాజరు కావాలని సూచించారు.

కూటమి ప్రభుత్వ తీరు దారుణం



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు రెడ్డి నారాయణరావు

విజయనగరం టౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆటో కార్మికుల నడ్డి విరగ్గొట్టిందని, కేంద్రం ప్రవేశపెట్టిన మోటారు వాహనాల చట్టం పేరుతో వేలాది రూపాయలు చలానా రూపంలో వసూలు చేస్తూ డ్రైవర్లపై విరుచుకుపడుతుండడం దారుణమని శ్రీ విజయదుర్గా ఆటోవర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు నీలాపు అప్పలరాజురెడ్డి, రెడ్డి నారాయణరావు పేర్కొన్నారు. మే డే పురస్కరించుకుని 20 ఆటోస్టాండ్‌లలో మేడే పతాకావిష్కరణలు చేశారు. అనంతరం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిర్వహించిన మే డే వేడుకల్లో పాల్గొని డ్రైవర్లతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన రాష్ట్రంలో సంపద సృష్టిస్తామని చెప్పి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రైవేట్ ఫిట్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటుచేసి కార్మికులను నిలువుదోపిడీ చేస్తోందన్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం జోక్యం చేసుకుని ఆర్టీఓ, పోలీసుల వేధింపులు ఆపాలని, ప్రైవేట్ ఫిట్‌నెస్ సెంటర్‌ను ఎత్తివేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బాలి సన్యాసిరావు, తర్లాడ శ్రీధర్‌తో పాటూ అధిక సంఖ్యలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

కోతల్లో ఇదో రకమా..!

- మరమ్మతుల పేరిట తరుచూ విద్యుత్ సరఫరా నిలిపివేత
- అవస్థలు పడుతున్న ప్రజలు



పినతరిమి వద్ద విద్యుత్ లైన్ల నిర్వహణలో అధికారులు, సిబ్బంది



సతివాడ సబ్‌స్టేషన్

నెల్లిమర్ల రూరల్: 'నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం' ఈ ప్రకటనలు గడిచిన ఎనిమిది నెలల నుంచి నియోజకవర్గ వ్యాప్తంగా నిత్య కృత్యంలా మారాయి. సరఫరా నిలిపివేస్తున్నామంటూ అధికారులే ముందస్తు ప్రకటనలు ఇస్తున్నారు. ప్రజలు ఇబ్బందుల పడకూడదని ముందుగానే అప్రమత్తం చేయడం మంచిదే అయినప్పటికీ గతంలో ఎన్నడూ లేని విధంగా నిత్యం ఇదే ప్రక్రియను విద్యుత్ అధికారులు అవలంభిస్తుండడంతో విసిగిపోతున్నామంటూ ప్రజలు చెబుతున్నారు. కోతల్లో భాగంగా ఇదో రకమైన విధానం కాబోలంటూ వినియోగదారులే విమర్శించడం గమనర్హం. సమస్య ఏదైనా.. విద్యుత్ సరఫరా నిలుపుదలతో ప్రజలకు మాత్రం తిప్పలు తప్పడం లేదు. అసలే వేసవి కావడంతో వారి వెతలు మరింత రెట్టింపు అవుతున్నాయనేది వాస్తవం.

మరమ్మతుల పేరిట కోతలు

నియోజకవర్గ వ్యాప్తంగా నాలుగు మండలాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల పేరిట తరుచూ కోతలు విధిస్తున్నారు. సాంకేతిక సమస్యలతో పాటు వివిధ కారణాలతో తరుచూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తుండడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. రాత్రి వేళల్లో కూడా కొన్ని గ్రామాల్లో లోడు సరిపోక అంతరాయం ఏర్పడుతుండంతో ఇబ్బందులు రెట్టింపు అవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. సరఫరా నిలుపుదలతో సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో కంప్యూటర్లు పనిచేయక పాలన పరమైన సమస్యతో అధికారులు కూడా ఇబ్బందులు పడుతున్నారు.

పైడిభీమవరం నుంచి రెండు సబ్‌స్టేషన్లకు

రణస్థలం మండలం పైడిభీమవరం 33 కేవీ లైన్ నుంచి నెల్లిమర్ల మండలంలోని సతివాడ, రామతీర్థం సబ్‌స్టేషన్లకు విద్యుత్ సరఫరా అవుతుండడంతో తరుచూ లోఓల్టేజ్ సమస్య ఏర్పడుతుంది. పైడి భీమవరం లైన్‌లో ఏదైనా సమస్య ఏర్పడుతున్నప్పుడు మండలంలోని సుమారు 30 గ్రామాల వరకు లో ఓల్టేజ్ వస్తోంది. దీంతో విద్యుత్ అధికారులు గరివిడి నుంచి ఆ రెండు సబ్ స్టేషన్లకు విద్యుత్ సరఫరా ఇవ్వాల్సిన పరిస్థితి ఉంది. పారసాం, వల్లూరు, బుచ్చన్నపేట, ఒమ్మి, తదితర గ్రామాల్లో విద్యుత్ అధికారులు ఇటీవల లోడుకు తగ్గ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో ఆయా గ్రామాలకు సమస్య తప్పింది.

నాణ్యమైన విద్యుత్ సరఫరానే లక్ష్యం



వినియోగదారుల ఇళ్లకు, వ్యవసాయ క్షేత్రాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాలతో పలు ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన మరమ్మతుల ప్రక్రియను కొనసాగిస్తున్నాం. చెట్ల కొమ్మలు తొలగించడంతో పాటు సాంకేతిక సమస్యలను సైతం పరిష్కరిస్తున్నాం. లోఓల్టేజ్ సమస్యలు ఉన్న గ్రామాల్లో అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి లోడును కూడా పెంచుతున్నాం. అనధికార కోతలు లేవు. ప్రజలు సహకరిస్తే అంతరాయం లేని విద్యుత్‌ను సరఫరా చేయగలం. గ్రామాల్లో సమస్యలు ఉంటే ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం.

–పిచ్చయ్య, విద్యుత్ ఏఈ, నెల్లిమర్ల

వారం రోజుల నుంచి సమస్య

మా గ్రామానికి వారం రోజుల నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. అధికారులను అడిగితే మరమ్మతులు చేపడుతున్నామని చెబుతున్నారు. సరఫరా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. గ్రామానికి లోఓల్టేజ్ సమస్య కూడా ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొత్తగా వేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను త్వరగా అందుబాటులోకి తీసుకువచ్చి సమస్యను పరిష్కరించాలి.

–పంచాది శ్రీను, వల్లూరు గ్రామం

కార్మికులకు న్యాయ అవగాహన సదస్సు



కార్మికులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి లక్ష్మీకుమారి

విజయనగరం లీగల్: అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్టుమెంట్ డిపోలో గురువారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి బీహెచ్‌వీ లక్ష్మీకుమారి కార్మికుల న్యాయ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కార్మిక చట్టాలు, వేతన సవరణ చట్టం, వారి హక్కులు, బాధ్యతల గురించి వివరించారు. అనంతరం వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్మికులు పని చేస్తున్న చోట ఆరోగ్యవంతమైన పరిసరాలు ఉన్నాయా.. లేవా.. పరిసరాలు పరిశుభ్రమైన వాతావరణంలో కార్మికులు పని చేస్తున్నారా... లేదా... అడిగి తెలుసుకున్నారు. కార్మికులతో ముఖాముఖిగా చర్చించారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అందిస్తున్న ఉచిత న్యాయం గురించి వారికి తెలియజేశారు. జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ 15100 నంబరుకు ఫోన్ చేసి న్యాయ సలహాలను పొందవచ్చని తెలియజేశారు. న్యాయపరమైన సమస్యలు ఉంటే నేరుగా జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సంప్రదించవచ్చునన్నారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ కె.సూర్యప్రకాష్, డిపో మేనేజర్ జె.శ్రీనివాస్, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ నామినేటెడ్ సభ్యులు జి.లలిత, జి.తిరుపతి, ఏపీ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్టుమెంట్ సభ్యులు, డిపో సిబ్బంది గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

హక్కులు కాపాడుకోవడం మన బాధ్యత

- విద్యుత్‌శాఖ ఎస్‌ఈ లక్ష్మణరావు



మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌ఈ లక్ష్మణరావు

విజయనగరం ఫోర్ట్: హక్కుల కాపాడుకోవడం మన బాధ్యత అని విద్యుత్ శాఖ ఎస్‌ఈ ముప్పల లక్ష్మణరావు అన్నారు. స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద గురువారం మేడే సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన పరిధిలో ఏ సమస్యలు ఉన్నా వాటిని పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానన్నారు. అదే విధంగా శాఖా పరంగా ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలన్నారు. పోరాట దినం మే డే స్ఫూర్తితో విద్యుత్ ఉద్యోగులు హక్కులు, సమస్యలపై పోరాడదామని, అందుకు విద్యుత్ ఉద్యోగులు సిద్ధం కావాలని విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు ఎస్.లక్ష్మణరావు, ప్రసాదరావు పిలుపు నిచ్చారు. అనంతరం ఉచిత మజ్జిగ కేంద్రాన్ని ఎస్‌ఈ ప్రారంభించారు. కార్యక్రమంలో ఈఈ సురేష్‌బాబు, సంఘం నాయకులు రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కట్టడాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దండి



మూడులాంతర్ల జంక్షన్ వద్ద స్థూపాన్ని పరిశీలిస్తున్న కమిషనర్, ఇంజినీరింగ్ అధికారులు

విజయనగరం: నగరంలోని ప్రాశస్త్యం కలిగిన కట్టడాలకు పాక్షిక మరమ్మతులు చేపట్టి మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. కార్పొరేషన్ పరిధిలోని గురజాడ కళాక్షేత్రం, పాల ఆసుపత్రి, మూడులాంతర్ల జంక్షన్, గాంధీ పార్క్ ప్రాంతాలను గురువారం ఆయన పరిశీలించారు. గురజాడ కళాక్షేత్రంలో షెడ్ నిర్మించడంతో పాటు విద్యుత్ దీపాలు అమర్చేందుకు, అలాగే చదువుకునే విద్యార్థులకు సౌకర్యవంతమైన బెంచీలు, కుర్చీలు ఏర్పాటు చేసి, పాక్షిక మరమ్మతులను చేపట్టేందుకు అంచనాలు తయారు చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. ప్రసిద్ధ పాలాస్పత్రి ప్రాంగణానికి చేరుకుని పారిశుధ్య కార్యక్రమాలకు అవసరమైన బ్లీచింగ్, డ్రమ్ములు ఇతర సామగ్రి భద్రపరిచేందుకు ఆసుపత్రి వెనుక వైపున షెడ్డు నిర్మాణానికి, అలాగే పాల ఆసుపత్రి ఔన్నత్యానికి విఘాతం కలగకుండా అవసరమైన మరమ్మతులు చేపట్టి అందంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. అనంతరం మూడులాంతర్ల జంక్షన్‌ను పరిశీలించి, పాక్షిక మరమ్మతులు చేపట్టి మరింత ఆకర్షణయంగా రూపుదిద్దే విధంగా చేపట్టాలన్నారు. మూడులాంతర్లు అనే నామఫలకాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. గాంధీ పార్క్ చేరుకొని పరిసరాలను పరిశీలించారు. ఇప్పటికే అక్కడ మరుగుదొడ్ల నిర్మాణానికి టెండర్లు ప్రక్రియ పూర్తయిందని, పనులు తక్షణమే ప్రారంభించేలా చొరవ చూపాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

హామీల అమల్లో కూటమి ప్రభుత్వ వైఫల్యం



మాట్లాడుతున్న జై భీమ్‌రావు భారత్ పార్టీ జిల్లా ప్రతినిధులు

నెల్లిమర్ల రూరల్: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జై భీమ్‌రావు భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టొంపల నరసయ్య, ప్రధాన కార్యదర్శి కనిగిరి శ్రీనివాసరావు అన్నారు. సతివాడలో గురువారం వారు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీలకు గృహ వినియోగానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అని చెప్పి, బిల్లుల కోసం తీవ్ర ఒత్తిడి తెస్తున్నారన్నారు. నిరుపేద కుటుంబాలు బిల్లులు చెల్లించలేకపోతే కనెక్షన్ తొలగిస్తామంటూ ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక గ్రామాల్లో దాహం కేకలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇంటింటికీ రక్షిత మంచినీరు సరఫరా హామీను గంగలో కలిపేశారని విమర్శించారు. దన్నానపేట గ్రామంలోని ఎస్సీ కాలనీలో మంచినీరు సదుపాయం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పలుమార్లు అధికారులకు చెప్పినా ఫలితం లేదన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు.

లేబర్ కోడ్‌లను వ్యతిరేకిద్దాం..



లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ముద్రించిన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

విజయనగరం టౌన్: కేంద్రంలోని పాలకులు కార్మిక వర్గం శ్రమశక్తిని కారుచౌకగా దోచిపెట్టేందుకు తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను మేడే స్ఫూర్తితో వ్యతిరేకిద్దామని ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.శంకరరావు పేర్కొన్నారు. అసంఘటిత రంగ కార్మిక హక్కుల కన్వీనర్ బి.గిరిప్రసాద్ అధ్యక్షతన అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య న్యూ నేతృత్వంలో పూల్‌బాగ్ ఊటగట్టు వద్ద గురువారం సమావేశం నిర్వహించి, పలు పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 8 గంటల పని హక్కుకు తూట్లు పొడిచి 12 గంటల పనిగా మార్చాలని చూస్తుందని, పాలకుల కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మే డే స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అప్పలరాజు, జిల్లా రజక సమాఖ్య అధ్యక్షుడు జి.సత్యారావు, మున్సిపల్ షాపు వర్తకుల సంఘం కార్యదర్శి డి.సన్యాసిరావు, విజయదుర్గా ఆటో వర్కర్స్ యూనియన్ కోశాధికారి ఎస్.కనకారావు, అల్యూమినియం స్పిన్నింగ్ వర్కర్స్ యూనియన్ జాయింట్ సెక్రటరీ తిరుపతిరాజు, ఇండస్ట్రియల్ ఏరియా వర్కర్స్ యూనియన్ కార్యదర్శి పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులగణనపై కేంద్ర నిర్ణయం హర్షణీయం



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంఘాల నాయకులు

విజయనగరం టౌన్: దేశంలో అత్యధిక జనాభా కలిగిన బీసీల ప్రయోజనం కోసం ఏర్పాటు చేసిన బీసీ కుల గణన బిల్లుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదముద్ర వేయడం అభినందనీయమని బీసీ కులాల ఐక్యవేదిక నాయకులు చోడి ఆదినారాయణ, టీవీ దుర్గారావు, కిల్లంపల్లి ఆచారి, మలిచర్ల చిట్టితల్లి పేర్కొన్నారు. స్థానిక బీసీ సంఘ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బీసీ కుల గణన వలన జనాభా ప్రాతిపదికన ప్రతి కులం ప్రజలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ, సంక్షేమ ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. దేశంలో బీసీ జాబితాలో అణగారిన వర్గాలకు కులాలకు చెందిన ప్రజలు అనేక మంది చట్ట సభల్లో ప్రాతినిధ్యం లేదని ఆవేదన వెలిబుచ్చారు. ప్రస్తుత బిల్లు వలన బీసీలో ఉన్న అన్ని కులాల ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వానంశెట్టి నాగేశ్వరరావు, పట్నాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

• సీహెచ్‌వోల నిరసన



తమను రెగ్యులర్ చేయాలని సీహెచ్‌ఓలు ఎస్.నీరజ, ఇ.రమాదేవితో పాటు పలువురు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విజయనగరంలోని కలెక్టరేట్ ఎదుట గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీహెచ్‌ఓలకు బదిలీలు చేపట్టాలన్నారు. హెల్త్ విలేజ్ క్లినిక్ అద్దె బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సీహెచ్‌ఓలకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో సింహాచలం, పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.

– విజయనగరం ఫోర్ట్

మే డే స్ఫూర్తితో హక్కుల కోసం పోరాటం



విజయనగరం గంటస్తంభం: నగరంలో సీపీఐ ఆధ్వర్యంలో కార్మికుల ర్యాలీ

కార్మిక హక్కుల సాధనకు, కార్మిక సమస్యల పరిష్కారానికి మే డే స్ఫూర్తితో ఐక్యంగా కార్మికులంతా పోరాడుదామని పలు కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా పలుచోట్ల గురువారం కార్మికులు ర్యాలీలు నిర్వహించారు. మే డే జెండాలను ఎగురవేశారు. రాష్ట్రంలో, కేంద్రంలో కార్మిక వ్యతిరేక ప్రభుత్వాలు పాలన సాగిస్తున్నాయని పలువురు వక్తలు మండి పడ్డారు. పాలకులు కార్మికుల హక్కులను కాలరాస్తూ కార్పొరేట్లకు అండగా నిలుస్తున్నారని ధ్వజమెత్తారు. రానున్న రోజుల్లో కార్మిక హక్కుల సాధనకు సంఘటిత పోరాటం అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



విజయనగరం గంటస్తంభం: సీపీఎం ఆధ్వర్యంలో ఎంజీ రోడ్డులో కార్మికుల ర్యాలీ



నెల్లిమర్ల: జెండా ఎగురు వేస్తున్న కార్మిక సంఘ నేతలు



విజయనగరం గంటస్తంభం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్టీసీ జోనల్ వర్క్‌షాప్ వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న కార్మికులు



డెంకాడ: పీహెచ్‌సీ వద్ద సీఐటీయూ జెండా ఆవిష్కరణ



పూసపాటిరేగ: మైలాన్ పరిశ్రమ వద్ద సీఐటీయూ జెండాను ఎగురవేస్తున్న కార్మిక సంఘం నాయకులు

విద్యాప్రదాత పీవీజీ

- ప్రముఖులకు సత్కారాలు



పీవీజీ జయంతి కార్యక్రమంలో సత్కార గ్రహీతలతో ఎమ్మెల్యే

విజయనగరం టౌన్: సమాజంలో ప్రజలు చైతన్యవంతులు కావాలంటే బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారికి విద్యనందించడమే మార్గమని దివంగత పీవీజీ రాజు భావించి మాన్సాస్ సంస్థలను స్థాపించారని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పేర్కొన్నారు. పీవీజీ 101వ జయంతిని డాక్టర్ పీవీజీ రాజు కళావేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అధ్యక్షతన గురువారం గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ మాన్సాస్ విద్యా సంస్థల్లో చదువుకోవడం గొప్ప అదృష్టంగా ప్రజలు భావించేవారన్నారు. ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు మాట్లాడుతూ మహారాజుగా కాకుండా మానవత్వంతో ప్రజల కోసం జీవించిన మహోన్నతమైన వ్యక్తి పీవీజీ రాజు అని కొనియాడారు. ప్రజల కోసం సర్వం త్యాగం చేసిన త్యాగశీలి అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రముఖులైన వయోలిన్ విద్వాంసులు ద్వారం దుర్గాప్రసాదరావు, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు, రామనారాయణం అధినేత నారాయణం శ్రీనివాస్, డాక్టర్ జీబీ.వెంకట్, హోమియో వైద్యులు గాడిప్రసాద్, స్వచ్ఛంద సేవకురాలు చీకటి చంద్రికారాణి, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు మరిశర్ల కృష్ణమూర్తినాయుడులను ఘనంగా సత్కరించారు.

విద్యతోనే చైతన్యం

విజయనగరం టౌన్: సమాజంలో ప్రజలు చైతన్యవంతులు కావాలంటే బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారికి విద్యనందించడమే మార్గమని దివంగత పీవీజీ రాజు భావించి మాన్సాస్ సంస్థలు స్థాపించారని కోడి రామమూర్తి వ్యాయామ సంఘం అభినవ భీమ పెద్దిలక్ష్మీ నారాయణ పేర్కొన్నారు. మాజీ మంత్రి, మాజీ పార్లమెంటు సభ్యుడు దివంగత పీవీజీ రాజు జయంతి సందర్భంగా కోడిరామమూర్తి వ్యాయామశాల వద్ద పీవీజీ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు సంఘ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.